

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పుట్టపర్తిలోని జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు.



టమాట కిలో రూ.26

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.26 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
31.8°/14.3°

జిల్లా పరిధిలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి వాతావరణం నెలకొంది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పలు రైళ్లకు కొత్త నంబర్లు



హిందూపురం: గుంతకల్లు రైల్వే డివిజన్ గుండా ప్రయాణించే పలురైళ్లకు రైల్వే శాఖ కొత్త నంబర్లు కేటాయించింది. ఈ కొత్త నంబర్లతో రైళ్లు జనవరి ఒకటో తేదీ నుంచి ప్రయాణిస్తాయని డివిజన్ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హిందూపురం-గుంతకల్లు రైలు (నంబర్ 77213), హిందూపూర్-గుంతకల్లు (77214), గుంతకల్లు-డోన్ (77203), డోన్-గుత్తి (77207), గుత్తి-డోన్ (77206), గుంతకల్లు -రాయచూరు (77201), రాయచూరు-గుంతకల్లు (77202), తిరుపతి-హుబ్లీ (57401), హుబ్లీ-తిరుపతి (57402), తిరుపతి- కదిరిదేవరపల్లి (57405), కదిరి దేవరపల్లి-తిరుపతి (57406), గుంతకల్లు-తిరుపతి (57404), తిరుపతి - గుంతకల్లు (57403), చిక్‌జాజూర్-గుంతకల్లు (57416), గుంతకల్లు-చిక్‌జాజూర్ (57415), కాచిగూడ -గుంతకల్లు (57412), గుంతకల్లు-బోదన్ (57411) రైళ్లకు కొత్త నంబర్లు కేటాయించినట్లు తెలిపారు.

26 నుంచి డిగ్రీ పరీక్షలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలతో పాటు మెగా సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 26 నుంచి ప్రారంభమవుతున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు మొత్తం 7,919 మంది, సప్లిమెంటరీ పరీక్షలకు 5,898 మంది రాయనున్నారు. ఐదో సెమిస్టర్‌లో రెగ్యులర్ 6,499 మంది, సప్లిమెంటరీకి 2,637 మంది దరఖాస్తు చేశారు. మెగా సప్లిమెంటరీ పరీక్షలకు మూడో సెమిస్టర్ 998 మంది, ఐదో సెమిస్టర్‌కు 979 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలో మొత్తం 56 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.

హాల్‌టికెట్లు ఇవ్వకపోతే బ్లాక్‌లిస్ట్‌లో పెడతాం

ప్రశాంతి నిలయం: ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల కారణంగా ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు పరీక్షల హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినట్టు ఫిర్యాదు అందితే సదరు కళాశాలలను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఫీజురీయింబర్స్‌మెంట్ అందలేదని విద్యార్థులను తరగతులకు కానీ, ప్రాక్టికల్స్‌కు కానీ వెళ్లకుండా అడ్డుకోరాదని తెలిపారు.

ఎనీ టైం మద్యం

కూటమి సర్కారు కొలువుదీరాక మద్యం ఏరులై పారుతోంది. లైసెన్సుడ్ దుకాణాల్లోనే కాదు ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు చేసిన బెల్టుషాపుల్లో విచ్చలవిడిగా మద్యం లభిస్తోంది. 24 గంటలూ ఎప్పుడు కావాలంటే అప్పుడు మద్యం విక్రయిస్తున్నారు. ఎమ్మార్పీకి మించి అధిక ధరలకు అమ్ముతూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు.

- బెల్టుషాపుల్లో విచ్చలవిడిగా అమ్మకాలు
- సౌకర్యాలతో బార్లను మరిపిస్తున్న వైనం
- అధిక ధరల వసూలుతో బాదుడే బాదుడు



చిలమత్తూరు మండలం శెట్టిపల్లిలోని ఓ ఇంట్లో వెలసిన బెల్టుషాపు



హిందూపురం బిసలమానేపల్లిలో బెల్టుషాపులో మద్యం అమ్మకాలు

హిందూపురం: కూటమి పార్టీల కార్యకర్తలకు బెల్టు షాపులు ఆదాయ వనరులుగా మారాయి. అనధికారిక మద్యం అమ్మకాలలో దూసుకుపోతున్నారు. బెల్టుషాపుల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నూతన మద్యం పాలసీ తీసుకురావటం ద్వారా మద్యం విచ్చలవిడి అమ్మకాలు చేపట్టకుండా నియంత్రించింది. నేడు టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అధికారంలోకి వచ్చాక పరిస్థితి పూర్తిగా అదుపు తప్పింది. ప్రభుత్వ టెండర్లలో మద్యంషాపులు దక్కించుకున్న వ్యాపారులు సిండికేట్‌గా మారడంతో పట్టణ శివార్లు, గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్టు షాపులు వెలిశాయి. పైగా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు. జిల్లాలో 87 మద్యం షాపులు లైసెన్స్ పొందగా.. బెల్టుషాపులు 800కుపైగా ఉన్నట్లు తెలుస్తోంది. అంటే పట్టణ పరిధిలో వార్డుకు ఒకటి, మండల పరిధిలో గ్రామానికి ఒకటి లేదా రెండు చొప్పున బెల్టుషాపులు వెలిశాయన్నమాట. బెల్టు షాపుల్లో అదనపు సౌకర్యాలు కల్పిస్తూ బార్లను మరిపిస్తున్నారు. దీంతో మందుబాబులు అక్కడే తాగి, తూగుతూ మత్తులోకి జారుకుంటున్నారు.

బహిరంగ ప్రదేశాల్లోనే మద్యపానం

ప్రభుత్వం నుంచి లైసెన్సు పొందిన మద్యం వ్యాపారులు సిండికేట్ రింగులోకి బెల్టు షాపులను తీసుకురావటంతో కుటీర పరిశ్రమగా మారిపోయింది. మద్యం వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగుతోంది. మందుబాబులు బహిరంగ ప్రదేశాలలో సేవించి ప్రజలను ఇబ్బంది పెట్టకూడదనే నిబంధనను పూర్తిగా గాలికి వదిలేశారు. బెల్టుషాపుల రద్దుపై మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తుంగలో తొక్కేశారు.

బెల్టుషాపుల నిర్వహణకు వేలం



పట్టణ, గ్రామాల్లో మద్యాన్ని బెల్టుషాపుల ద్వారా అమ్మకాలు చేపట్టేందుకు వేలం నిర్వహించినట్లు తెలుస్తోంది. మద్యం షాపు వారికి అడ్వాన్సుగా చెల్లించి రోజూ మద్యం తీసుకొచ్చి బెల్టుషాపు వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి లైసెన్సు పొందిన మద్యం షాపుల్లో ఎమ్మార్పీ కంటే రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా దండుకుంటున్నారు. వీటిని బెల్టు షాపుల ద్వారా అమ్మేసరికి మరింత బాదుతున్నారు. బెల్టు షాపుల నిర్వాహకులు వ్యాపారులు నుంచి కొనుగోలు చేసిన ధరకు రూ.25 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం



అనధికారికంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకున్నా పర్మిట్ రూములు, బెల్టుషాపులు నిర్వహిస్తే దాడులు చేసి చట్టపరమైన చర్యలు చేపడతాం. ఆకస్మిక తనిఖీలు చేసి నిబంధనలకు వ్యతిరేకంగా సాగుతున్న వ్యాపారాలను కట్టడి చేసి.. నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తాం.

– లక్ష్మీదుర్గయ్య, ఎక్సైజ్ సీఐ, హిందూపురం

తాగుడే... తాగుడు!

- 50 రోజుల్లో 13 లక్షల లీటర్ల మద్యం విక్రయం
- లిక్కర్ గోదాము నుంచి రూ.79 కోట్ల విలువైన మద్యం సరఫరా
- మద్యపానంలో ధర్మవరం టాప్

సాక్షి, పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం అమలు చేసిన నూతన మద్యం పాలసీతో మందుబాబులు పండుగ చేసుకుంటున్నారు. కోరుకున్న వారికి ఏ క్షణంలోనైనా మద్యం దొరుకుతుండడంతో రోజూ మద్యం మత్తులో తూలుతున్న వారి సంఖ్య పెరిగింది.

అగ్రస్థానంలో ధర్మవరం

నిత్యావసర సరుకుల తరహాలో మద్యం అక్రమ సరఫరా కూటమి నేతలు జేబులు నింపుతోంది. అధికారిక పర్యవేక్షణ లేకపోవడంతో జిల్లాలో మద్యం దుకాణ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గత అక్టోబరు 16 నుంచి కొత్త మద్యం పాలసీ అమలులోకి వచ్చిన తర్వాత ఇబ్బడిముబ్బడిగా ప్రైవేటు మద్యం దుకాణాలు వెలిశాయి. కొన్నచోటే మద్యం తాగేందుకు చాలా ప్రాంతాల్లో అనుమతిస్తుండడం మందుబాబులకు వరంగా మారింది. అక్రమార్జనే ధ్యేయంగా ప్రతి మద్యం దుకాణం పరిధిలో సగటున 10 బెల్టు షాపులూ నిర్వహిస్తున్నారు. క్వార్టర్‌పై రూ.100 ఎక్కువ ఇస్తే ఇంటి వద్దకే మద్యాన్ని చేరవేస్తున్నారు. జిల్లా పరిధిలో ఏర్పాటైన 87 ప్రైవేటు మద్యం దుకాణాల ప్రారంభమైనప్పటి నుంచీ ఈ 50 రోజుల వ్యవధిలో రూ.79 కోట్ల విలువ చేసే 13 లక్షల లీటర్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో ఒక్క ధర్మవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోనే రూ.19 కోట్ల విలువైన మద్యం విక్రయాలు సాగడం విశేషం.

రోజుకు 26 లక్షల లీటర్ల చొప్పున

జిల్లా వ్యాప్తంగా వెలసిన 87 మద్యం దుకాణాలకు గానూ ఇప్పటి వరకూ 13 లక్షల లీటర్ల మద్యం గోదాముల నుంచి సరఫరా అయింది. సగటున 26 వేల లీటర్ల మద్యం వినియోగించినట్లు తెలుస్తోంది. అతి తక్కువ వ్యవధిలో రూ.79 కోట్ల విలువ చేసే మద్యం తాగారంటే ప్రతి మద్యం దుకాణం నుంచి సగటున రోజుకు 300 లీటర్లకుపైగా మద్యం సేల్ అవుతున్నట్లు అంచనా. ఇందులో బీర్ల కంటే మద్యం అమ్మకాలే భారీ స్థాయిలో ఆదాయం తెచ్చి పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇక చీప్ లిక్కర్ అందుబాటులోకి వస్తే మద్యం అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉంది.



నాల్గో వంతు బీర్ల సేల్

జిల్లా వ్యాప్తంగా ఈ 50 రోజుల వ్యవధిలో 1.44 లక్షల కేసుల మద్యం అమ్మకాలు జరిగాయి. ఇందులో కేవలం 35 వేల కేసులు మాత్రమే బీర్లు అమ్ముడు పోయినట్లు ఎక్సైజ్ శాఖ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఆరంభంలో ఒక్కో మద్యం దుకాణం పరిధిలో రోజుకు రూ.లక్షకు మించి వ్యాపారం జరగలేదు. అనంతరం బెల్టు షాపులకు తెరలేపడంతో వ్యాపారం రెట్టింపయినట్లు తెలుస్తోంది.

ముగిసిన సత్యసాయి జయంతి వేడుకలు



ప్రశాంతి నిలయం: పుట్టపర్తిలో ఈ నెల 18న ప్రారంభమైన సత్యసాయి 99వ జయంతి వేడుకలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. ఏడు రోజులపాటు సాగిన మహా నారాయణ సేవలో భాగంగా దాదాపు 900 మంది సత్యసాయి సేవాదళ్ సభ్యులు 3.60 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ద్వారా నిర్వహించిన మెడికల్ క్యాంపులో 12,500 మందికి వైద్య సేవలందించారు. వేడుకలను విజయవంతం చేసిన భక్తులు, సత్యసాయి సేవాదళ్, ప్రభుత్వ అధికారులు అందరికీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌రాజు ధన్యవాదాలు తెలిపారు. రాబోవు శతజయంతి వేడుకలను మరింత విజయవంతం చేసేందుకు చక్కటి ప్రణాళికలతో ముందుకు సాగుతామని చెప్పారు. ఇదిలా ఉండగా వేడుకలు ముగియడంతో దేశ విదేశాలకు చెందిన సత్యసాయి భక్తులు తమ స్వస్థలాలకు బయల్దేరారు.

సజావుగా కోఆపరేటివ్ అసోసియేషన్ ఎన్నికలు



ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న సిబ్బంది

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తిలోని జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ కార్యాలయంలో (డీసీఏఓ) ఏపీ కోఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా ఎన్నికలు ఆదివారం సజావుగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏపీ కోఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగరమణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా తొమ్మిది మందితో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా సీసీ రామచంద్రయ్య, అసోసియేట్ అధ్యక్షులుగా సయ్యద్‌బాషా, ఉపాధ్యక్షులుగా రమేష్‌బాబు, సెక్రటరీగా శ్రీరాములు, జాయింట్ సెక్రటరీగా శ్రీనాథ్, ట్రెజరర్‌గా రవి, మహిళా విభాగం సెక్రటరీగా రాధమ్మ, గ్రేడ్– 1 సెక్రటరీగా చెన్నకేశవులు, గ్రేడ్ -2 సెక్రటరీగా అనిల్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఎన్నికైన సభ్యులను సిబ్బంది ఘనంగా సన్మానించారు.

అరాచకవాది ఎస్‌ఎస్

- కొత్తచెరువులోఎక్కువైన టీడీపీ నేత ఆగడాలు సాలక్కగారి శ్రీనివాసులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక రెచ్చిపోతున్న వైనం
- పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలపై కన్ను
- స్టేషన్‌కు వెళ్తే సన్మానం చేసి పంపిన సీఐ ఇందిర
- సామాజిక మాధ్యమాల్లో ఫొటో, వీడియో వైరల్



మహిళను చితకబాదుతున్న సాలక్కగారి శ్రీనివాసులు (ఫైల్)



సాలక్కగారి శ్రీనివాసులును సన్మానిస్తున్న కొత్తచెరువు సీఐ ఇందిర (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఎస్‌ఎస్.. ఇదో వ్యక్తి పేరు. పుట్టపర్తి నియోజకవర్గం కొత్తచెరువు మండల కేంద్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నిత్యం వార్తల్లో నిలుస్తున్న వ్యక్తి సాలక్కగారి శ్రీనివాసులు అలియాస్ ఎస్‌ఎస్. మండలంలో తానే కింగ్ నంటూ విర్రవీగుతుంటాడు. కేసులకు బెదిరేది లేదంటాడు. బంధువుల ఇంటికి వెళ్లి వచ్చినట్లు పోలీస్ స్టేషన్‌కు వెళ్లొస్తానని ప్రగల్భాలు పలుకుతుంటాడు. ఇతని తీరుతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధిగా ఉంటూ ఎన్నో దందాలు చేశాడు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా దాడులకు తెగబడుతున్నాడు. మహిళలు అని కూడా చూడకుండా నేరుగా అతనే రంగంలోకి దిగి చితకబాదుతున్నాడు. కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లో సీఐగా పని చేస్తున్న ఇందిర కూడా ఇతనికి వత్తాసు పలుకుతున్నారు. ఇటీవల పోలీసుస్టేషన్‌కు వెళ్లిన ఎస్‌ఎస్‌కు శాలువా కప్పి, పూలహారం వేసి మరీ సన్మానించారు. రౌడీషీటర్‌గా ఉన్న ఎస్‌ఎస్‌కు ఓ పోలీసు అధికారి సన్మానం చేయడం ఏంటని నెటిజన్లు సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు. ఎస్‌ఎస్ ఇంత చేస్తున్నా.. పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి నోరు మెదపకపోవడం గమనార్హం.

మహిళలను చితకబాది..

కొత్తచెరువులో నివాసం ఉండే ఎస్‌ఎస్‌కు ఇటీవల ఇంటి పక్కనే ఉన్న వారితో రోడ్డు విషయమై తగాదా తలెత్తింది. దీనిపై అవతలి నుంచి మహిళలు నిలదీయగా.. తనపైనే తిరగబడతారా? ఎదురు మాట్లాడతారా? అంటూ ఇంట్లో నుంచి బయటకు ఈడ్చుకొచ్చి చితకబాదాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళలకు రక్షణ లేదని చెప్పడానికి ఇదొక్క నిదర్శనం చాలదా అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

స్టేషన్‌కు పిలిపించి కాపుకాచి

కూటమి ప్రభుత్వంపై సామాజిక మాధ్యమాల్లో వ్యతిరేక పోస్టులు పెడుతున్నారనే కారణంతో కొత్తచెరువు మండలం కొడపగానిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఈ నెల 17న పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ముగ్గురినీ పంపించారు. అయితే స్వగ్రామానికి తిరిగి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై సాలక్కగారి శ్రీనివాసులు అనుచరులు దాడి చేశారు. మరుసటి రోజు ఉదయం బాధితులు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు.

22 ఇంటి స్థలాలపై కన్ను

కొత్తచెరువు నుంచి ధర్మవరం వెళ్లే దారిలో జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. అక్కడ వందలాది మందికి ఇంటి స్థలాలు పంపిణీ చేశారు. అయితే రోడ్డుకు ఆనుకుని ఉండే 22 స్థలాలపై ఎస్‌ఎస్ కన్ను పడింది. అధికారులను అడ్డుపెట్టుకుని నిర్మాణాలు ఆపాడు. దీనిపై బాధితులు కలెక్టరేట్ చుట్టూ తిరిగినా ఇప్పటికీ న్యాయం జరగలేదు.

అక్రమాలు అన్నీ ఇన్నీ కాదయా..

సాలక్కగారి శ్రీనివాసులు అక్రమాలు కొత్తచెరువులో ఒక్కొక్కటిగా వెలికి తీస్తే పెద్ద పుస్తకమే అవుతుంది. అధికారాన్ని.. అధికారులను అడ్డు పెట్టుకుని ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం వెన్నతో పెట్టిన విద్య. స్థానిక పెనుకొండ రోడ్డులోనూ చాలామంది పేదల భూములను కొట్టేశాడు.

సాలక్కగారి శ్రీనివాసులును అరెస్టు చేయాలి

- సీపీఎం నేతల డిమాండ్



బాధిత మహిళలు పార్వతమ్మ, ప్రణీతలను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

పుట్టపర్తి: కొత్తచెరువు నెహ్రూ కాలనీలో ఇటీవల రస్తా విషయమై ఇంట్లోకి చొరబడి పార్వతమ్మ, ప్రణీత అనే ఇద్దరు మహిళలపై విచక్షణ రహితంగా దాడిచేసిన టీడీపీ నాయకుడు సాలక్కగారి శ్రీనివాసులును వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, కార్యవర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. బాధిత మహిళలను వారు ఆదివారం పరామర్శించారు. నిందితుడిని అరెస్టు చేసి.. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్పీగా మహిళ ఉన్నా.. సాటి మహిళలపై దాడి చేసిన వారిని ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా సభ్యుడు పెద్దన్న ,నియోజకవర్గ కార్యదర్శి బ్యాళ్ల అంజి తదితరులు పాల్గొన్నారు.

అశ్రునయనాలతో అంత్యక్రియలు



తల్లిదండ్రుల మృతదేహాలపై మట్టి వేస్తున్న కుమార్తె స్పందన

పుట్లూరు: 'దేవుడా మమ్మల్ని అనాథలను చేశావు కదయ్యా... అమ్మానాన్నలు లేకుండా ఎలా బతకాలి' అంటూ ఆ పిల్లలు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. 'స్వామీ.. ఇక నాకు దిక్కెవరయ్యా' అంటూ ఓ ఇల్లాలు గుండెలవిసేలా విలపిస్తుంటే ఆమెను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. గార్లదిన్నె మండలం తలగాచిపల్లి క్రాస్ వద్ద శనివారం ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో మృతి చెందిన ఎనిమిది మంది అంత్యక్రియలు ఆదివారం పుట్లూరు మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో నిర్వహించారు. మృతదేహాలను శ్మశాన వాటికకు తీసుకెళ్తున్న సమయంలో కుటుంబసభ్యులు, బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి. నిత్యం తమ మధ్య ఉన్న వారు మరణించడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోయారు. మృతులతో తమ అనుబంధం గుర్తుచేసుకుని కన్నీళ్లు పెట్టుకున్నా రు. అశ్రునయనాలతో తుది వీడ్కోలు పలికారు.

పరామర్శించిన వైఎస్సార్‌సీపీ నేతలు..

వైఎస్సార్‌సీపీ నేత ఆలూరు సాంబశివారెడ్డి, పార్టీ శింగనమల సమన్వయకర్త వీరాంజనేయులు, ఎంపీపీ రాఘవరెడ్డి తదితరులు ఎనిమిది మంది మృతదేహాలకు నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. అంత్యక్రియల కోసం రూ.10 వేల చొప్పున అందజేశారు. బాధపడరాదని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

- మృతుల కుటుంబాలను ఎమ్మెల్యేలు బండారు శ్రావణి, ఎంఎస్ రాజు, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. తగిన విధంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



జయరాముడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు ఆలూరు సాంబ, వీరాంజనేయులు



సొమ్మసిల్లిన డి.నాగమ్మ కుమార్తెను తీసుకెళ్తున్న గ్రామస్తులు

కుటుంబంలో ఒకరికి ఉద్యోగం

పుట్లూరు : మృతుల కుటుంబంలో ఒకరికి అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశాన్ని కల్పించి ఆదుకుంటామని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగన్న, నాగమ్మ, కొండమ్మ, ఈశ్వరయ్య, బాల పెద్దయ్య, రామాంజినమ్మ, నాగమ్మ, జయరాముడు కుటుంబాలకు ఆదివారం రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వ సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో ఎనిమిది మంది మరణించడం బాధాకరమన్నారు. ఎంత చేసినా కష్టాన్ని తీర్చలేమని, ధైర్యంగా ఉండాలని బాధిత కుటుంబీకులకు సూచించారు. మృతుల కుటుంబ సభ్యులు ఇంటి పెద్దలను కోల్పోయామంటూ మంత్రి వద్ద కన్నీరుమున్నీరయ్యారు. కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే బండారు శ్రావణి, ఎస్పీ జగదీష్, ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు ఉచితంగా వైద్యం

అనంతపురం మెడికల్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులకు ఉచితంగా వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నట్లు మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. నగరంలోని కిమ్స్-సవీరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐదుగురిని ఆదివారం మంత్రి పరామర్శించారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ ప్రమాదం విషయం తెలియగానే మృతులు ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించామన్నారు. కలెక్టర్ వినోద్ కుమార్ క్షతగాత్రులను కిమ్స్-సవీరకు తరలించి మెరుగైన వైద్యం అందించేలా చూడటంతో ప్రాణాలు నిలబడ్డాయన్నారు. బాధిత పిల్లల చదువులకు సాయం అందించడంతో పాటు, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రమాదాల కట్టడికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- క్షతగాత్రులను మంత్రి టీజీ భరత్ కూడా పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

కూరగాయల సాగుపై ఆసక్తి

- 26వేల హెక్టార్లలో వివిధ రకాల కూరగాయల పంటలు
- మార్కెట్లో ధర నిలకడతో రైతుల్లో హర్షం


గోరంట్ల వద్ద సాగులో ఉన్న అనప పంట


పెడపల్లి వద్ద టమాటను కోస్తున్న కూలీలు


సుబ్బరాయనిపల్లి వద్ద సాగు చేసిన ఉర్లగడ్డ పంట

పుట్టపర్తి అర్బన్: నిత్యావసరాల్లో ఒక్కటైన కూరగాయాల ధర మార్కెట్‌లో నిలకడగా ఉండడంతో చాలా మంది రైతులు ప్రస్తుతం కూరగాయల సాగుపై దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ కూరగాయల పంటలతో పాటు దోస, పూల తోటలను సుమారు 26,347 హెక్టార్లలో సాగులోకి వచ్చింది. ఇందులో అత్యధికంగా టమాట, వంకాయ, బీర, కాకర, చిక్కుడు, అనప, పచ్చి మిర్చి, ఎండు మిర్చి, క్యారెట్, క్యాబేజీ తదితర కూరగాయలు ఉన్నాయి.

26,347 హెక్టార్లలో సాగు

జిల్లా వ్యాప్తంగా 26,347 హెక్టార్లలో కూరగాయలు, ఆకు కూరలు, దోస, కలింగర, పూల తోటలు సాగులో ఉన్నాయి. వీటిలో అత్యధికంగా 19,963 హెక్టార్లలో టమాట సాగులో ఉంది. 356 హెక్టార్లలో వంకాయ, 540 హెక్టార్లలో అనప, 348 హెక్టార్లలో ఉర్లగడ్డ, 1,433 హెక్టార్లలో ఎండు మిర్చి, 1,040 హెక్టార్లలో పచ్చి మిర్చి, 356 హెక్టార్లలో గోరుచిక్కుడు, 374 హెక్టార్లలో ఉల్లి, 1,097 హెక్టార్లలో ఇతర కూరగాయలు, ఆకుకూరల పంటలు సాగులో ఉన్నాయి.

నిలకడగా ధరలు

తరచూ కూరగాయల ధరలు ఎగుడు దిగుడుగా మారి రైతులకు నష్టాలను మిగుల్చుతూ వచ్చాయి. అయితే నెల రోజులుగా ధర నిలకడగా ఉండడంతో పలువురు రైతులు సాగు చేసిన కూరగాయలకు గిట్టుబాటు ధర లభ్యమవుతోంది. 13 కిలోల టమాట బాక్సు రూ.400, 10 కిలోల వంకాయల బస్తా రూ.250, 50 కిలోల ఉర్లగడ్డ బస్తా రూ.2,200, కిలో అనపకాయలు రూ.40, కిలో చిక్కుడు రూ.40, కిలో పచ్చి మిరప రూ.50, ఎండు మిర్చి టన్ను రూ.15 వేల నుంచి రూ.20 వేలు, 50 కిలోల ఉల్లి బస్తా రూ.1,500 నుంచి రూ.2వేల వరకూ అమ్ముడుపోతున్నాయి.

మార్కెట్ సదుపాయం లేక ఇబ్బంది

జిల్లాలో రైతుల పంట ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సదుపాయం లేదు. దీంతో చాలా మంది రైతులు బాగేపల్లి, డీ క్రాస్, మదనపల్లి, బెంగళూరు, చెన్నై, అనంతపురం తదితర మార్కెట్‌లకు కూరగాయలను తరలించాల్సి వస్తోంది. స్థానికంగా హిందూపురం, కదిరి, గోరంట్ల , ధర్మవరం వంటి ప్రాంతాల్లో మార్కెట్‌లు ఏర్పాటు చేయాలని చాలా కాలంగా రైతులు కోరుతున్నారు. ఉద్యాన పంటలపై దృష్టి సారించిన ప్రభుత్వం.. స్థానికంగా రైతుల పంట ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పించకపోవడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

కూరగాయల సాగుతో లాభాలు



నేను మూడు ఎకరాల్లో ఆలుగడ్డ సాగు చేశా. ప్రస్తుతం ధర నిలకడగా ఉంటోంది. ఖర్చులు పోనూ ఎకరాకు రూ. 1 లక్ష వరకు ఆదాయం వస్తోంది. కూరగాయల పంటలతోనే అధిక లాభాలు వస్తున్నాయి.
– చంద్రాయుడు, రైతు, సుబ్బరాయనిపల్లి

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



జిల్లాలో వారపు సంతలు తప్పా... పెద్ద మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో పండించిన కూరగాయలను బెంగళూరు, చెన్నై, మదనపల్లి, బాగేపల్లి తదితర మార్కెట్ లకు తరలించాల్సి వస్తోంది. ఇది చాలా ఖర్చుతో పాటు అధిక శ్రమతో కూడుకున్నది. అంత దూరం సరుకు తీసుకెళ్లలేక దళారులు ఎంత చెబితే అంతకు పంటను అమ్ముకోవాల్సి వస్తోంది. – తిరుపాల్‌నాయక్, రైతు, పెడపల్లి

ప్రాణాలు పోతున్నా.. పట్టదా?


వాహనం నుంచి ప్రయాణికులను కిందకు దింపుతున్న పోలీసులు

తాడిపత్రి టౌన్: ప్రమాదమని తెలిసినా.. పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయడంలో వాహనదారులు పోటీ పడుతూనే ఉన్నారు. శింగనమల నియోజకవర్గం గార్లదిన్నె వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఎనిమిది మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాడిపత్రి పోలీసులు అప్రమత్తమై ఆదివారం సాయంత్రం యల్లనూరు రోడ్డు సర్కిల్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా పరిమితికి ప్రయాణికులను తరలిస్తున్న రెండు ఆటోలు, రెండు బొలెరోలను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి వాహనాలను ఆర్టీఓకు అప్పగించారు. పరిమితికి మించి వాహన ప్రయాణం చేస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రయాణికులను పోలీసులు హెచ్చరించారు.

క్లుప్తంగా

వ్యక్తి దుర్మరణం


మృతుడు సూర్యనారాయణ

సోమందేపల్లి: కారు ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహన దారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. సోమందేపల్లికి చెందిన సూర్యనారాయణ (47) పాలసముద్రం వద్ద ఉన్న ఓ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం విధులు ముగించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరుగు ప్రయాణమైన ఆయన వెలగమాకులపల్లి క్రాస్ సమీపంలో 44వ జాతీయ రహదారిపైకి చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొని అక్కడికక్కడ మృతి చెందాడు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై ఎస్‌ఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్రవాహనాలు ఢీ - వృద్ధుడి మృతి

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీనివాసక్యాంప్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు.. దేవగిరి క్రాస్‌కు చెందిన కొండయ్య (75) ఆదివారం శ్రీనివాస క్యాంపు సమీపంలో పొలం పనులు చూసుకుని తన సూపర్ ఎక్స్‌ఎల్ వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. అదే సమయంలో బెంగళూరు నుంచి మంత్రాలయానికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న గోవర్ధన్ అనే వ్యక్తి ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన కొండయ్యను బళ్లారిలోని విమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన గోవర్ధన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గుత్తిలో తుపాకీ కలకలం

గుత్తి: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని జెడ్.వీ రారెడ్డి కాలనీలో ఆదివారం గన్ కలకలం రేపింది. కాలనీలో ఓ ఇంటి పక్కన పడి ఉన్న గన్ (పిస్టల్)ను స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, స్వాధీనం చేసుకున్నారు. పిస్టల్ పురాతనమైందని, అందులో బుల్లెట్లు ఏమీ లేవని పోలీసులు తెలిపారు. పిస్టల్ ఎవరిదనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్తగా మన ఊళ్లో గన్ కల్చర్ ఏమిటంటూ గుత్తి వాసులు చర్చించుకోవడం గమనార్హం.

ఆలయంలో చోరీ

కంబదూరు: మండలంలోని కదిరిదేవరపల్లిలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. తాళం బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు సుమారు రూ.2 లక్షలు విలువ చేసే 9 వెండి గొడుగులు, 3 వెండి నాగ పడగలు, 6 వెండి కిరీటాలు, బంగారు తాళి బొట్టు గిన్నెలు, రూ.3 వేల నగదు అపహరించారు. ఆదివారం ఉదయం ఆలయంలో పూజాదికాలు చేసేందుకు వెళ్లిన అర్చకులు గమనించి సమాచారం ఇవ్వడంతో ఈఓ దేవదాసు, డీఎస్పీ రవిబాబు, సీఐ నీలకంఠేశ్వర, ఇన్‌చార్జ్ ఎస్‌ఐ రాంభూపాల్ తదితరులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేశారు.

డ్రైవర్ల అవగాహన రాహిత్యంతోనే ఘోరం

- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు
- డీటీసీ వీర్రాజు


తలగాచిపల్లి క్రాస్ వద్ద ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న డీటీసీ వీర్రాజు, తదితరులు

గార్లదిన్నె: ఆర్టీసీ, ఆటో డ్రైవర్ల అవగాహన రాహిత్యంతోనే తలగాచిపల్లి క్రాస్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నట్లు డీటీసీ వీర్రాజు తెలిపారు. రెండు రోజుల క్రితం మండల పరిధిలోని తలగాచిపల్లి క్రాస్ వద్ద ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొని ఎనిమిది మంది కూలీలు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం ఘటనాస్థలాన్ని కళ్యాణదుర్గం ఆర్టీఓ రమేష్, ఎంవీఐ సునీత, డీఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి డీటీసీ వీర్రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతామన్నారు. తలగాచిపల్లి క్రాస్‌లో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు అరిగిపోయాయని, త్వరలో వాటి ఎత్తు పెంచి, పెయింటింగ్ వేస్తామని పేర్కొన్నారు.

ఘటన బాధాకరం..

ఘోర రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది వ్యవసాయ కూలీలు చనిపోవడం బాధాకరమని మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం నుంచి గుంతకల్లు వెళ్తూ మార్గమధ్యలో తలగాచిపల్లి క్రాస్‌లో ప్రమాద స్థలాన్ని ఆమె పరిశీలించారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జాతీయ రహదారులపై ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి, రోడ్డు నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య, గార్లదిన్నె ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా, హైవే ప్రాజెక్టు అధికారి వలి, ఇంజినీర్లు భరత్, అమీన్ పాల్గొన్నారు.

క్వారీలో తేనెటీగల దాడి

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల సమీపంలోని ఓ క్వారీలో తేనెటీగలు దాడి చేయడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకోగా గాయపడిన మస్తాన్, రామాంజినేయలును వెంటనే కొనకొండ్ల పీహెచ్‌సీలో చికిత్సలు అందజేసి, గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న మస్తాన్‌ను ఆదివారం ఉదయం అనంతపురానికి రెఫర్ చేశారు.

యువకుడి దుర్మరణం

తనకల్లు: మండలంలోని చీకటిమానిపల్లి పేపర్ ఫ్యాక్టరీ వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో సింగిరివాండ్లపల్లికి చెందిన నరేష్ (28) దుర్మరణం పాలయ్యాడు. భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఐచర్ వాహనానికి డ్రైవర్‌గా వెళుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆదివారం అన్నమయ్య జిల్లా మొలకలచెరువుకు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన ఆయన ఫ్యాక్టరీ దగ్గరకు చేరుకోగానే తిరుపతికి వెళుతున్న కేఎస్ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జింక చర్మాల అక్రమ రవాణా ముఠా అరెస్ట్


స్వాధీనం చేసుకున్న జింక చర్మాలు, కొమ్ములను చూపుతున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు

వజ్రకరూరు: అనంతపురం, కర్నూలు జిల్లాల్లో జింకలను వేటాడి చంపి.. వాటి మాంసాన్ని విక్రయించడంతో పాటు చర్మాలను అక్రమ రవాణా చేస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను వజ్రకరూరు పోలీసులు అరెస్టు చేశారు. ముఠా నుంచి 24 జింక చర్మాలు, రెండు కొమ్ములు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం వజ్రకరూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ నాగస్వామి..ఫారెస్ట్ సెక్షన్ అధికారి కరీముల్లా, బీట్ ఆఫీసర్ సతీష్‌తో కలసి వివరాలు వెల్లడించారు. గుంతకల్లు పట్టణానికి చెందిన షికారి దేవరాజు, షికారి గోవిందు, అనంతపురం నగరానికి చెందిన షికారి బాబు, షికారి బాలరాజు, గుంతకల్లు మండలం ఆచారమ్మ కొట్టాలకు చెందిన వడ్డే పెద్దఅంజి గుంతకల్లు, వజ్రకరూరు, ఆలూరు, చిప్పగిరి తదితర ప్రాంతాల్లో వ్యవసాయ పొలాల్లో ఉచ్చులు ఏర్పాటు చేసి జింకలను వేటాడేవారు. వాటి మాంసాన్ని విక్రయించడంతో పాటు చర్మాలను కర్ణాటకలోని బళ్లారి, కంప్లి, హొస్పేట్ తదితర ప్రాంతాలకు అక్రమ రవాణా చేసేవారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 24 జింక చర్మాలు, రెండు కొమ్ములను సంచుల్లో వేసుకుని కర్ణాటక వైపు వెళుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అటవీ శాఖ అధికారులతో కలసి వజ్రకరూరు మండలం కొనకొండ్ల సమీపంలోని బళ్లారి జాతీయ రహదారిలో వారిని పట్టుకున్నారు. నిందితులను ఆదివారం అనంతపురంలోని మొబైల్‌కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

అనంతపురం: త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను ఆదివారం అనంతపురంలోని అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. అండర్–14 బాలికల విభాగంలో ఎ.స్మిత (22 కేజీలు), కావ్య (24 కేజీలు), సాత్విరెడ్డి (26 కేజీలు), తేజశ్రీ (30 కేజీలు), దివ్య సాయి (38 కేజీలు), దీక్ష (42 కేజీలు), లక్ష్మి (46 కేజీలు), రిష్మిత (50 కేజీలు) ఎంపికయ్యారు. అండర్–17 విభాగంలో ఇందుమతి, జయశ్రీ, సాయి అక్షిత, లీలాంజలి, తీర్థి, భాగ్యలక్ష్మి, దీపిక, వసుధ, సింధుజ, సాకియా, నందిని చోటు దక్కించుకున్నారు. ఈ ప్రక్రియను అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రారంభించగా జిల్లా ఎస్జీఎఫ్ సెక్రెటరీ సుగుణమ్మ, పీడీలు నాగరాజు, అబ్జర్వర్ దేవకీ పర్యవేక్షించారు.



నేత్రపర్వం... ఖాద్రీశుడి కల్యాణోత్సవం

కదిరి టౌన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి, వేదమంత్రోచ్చారణలతో కల్యాణం జరిపించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

స్ఫూర్తిదాయకంగా ఉద్యోగుల క్రికెట్


టోర్నీని ప్రారంభిస్తున్న మాంఛో ఫెర్రర్

అనంతపురం: యువతలో స్ఫూర్తి రగిలించేలా ఐపీఎల్ తరహాలో ఉద్యోగుల క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ అన్నారు. ఏపీ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్, ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫాదర్ ఫెర్రర్ ఉద్యోగస్తుల క్రికెట్ టోర్నీని ఆదివారం అనంతక్రీడాగ్రామంలో ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఉద్యోగులకు ఆటవిడుపుతో పాటు ఆరోగ్యానికి, మానసికోల్లాసానికి ఈ తరహా పోటీలు దోహదపడతాయన్నారు. అంతర్జాతీయ స్థాయి క్రికెటర్లను తయారు చేయడమే లక్ష్యంగా ఆర్డీటీ పనిచేస్తోందన్నారు. వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చేసిన సేవలకు గుర్తుగా ఏటా ఆయన జ్ఞాపకార్థం ఉద్యోగస్తులకు, జర్నలిస్టులకు క్రికెట్ టోర్నీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ టోర్నీలో 20 జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయన్నారు. బార్ కౌన్సిల్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది గురుప్రసాద్, అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి, జుడిషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

- అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేష్‌బాబు


మాట్లాడుతున్న సురేష్‌బాబు

అనంతపురం అర్బన్: రాష్ట్రంలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనం పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ కూటమి సర్కార్‌ను అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్‌బాబు, అమరావతి జేఏసీ జిల్లా చైర్మన్ ఆర్.ఎన్.దివాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ఖాన్ డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురంలోని రెవెన్యూ ఉద్యోగుల సంఘం భవన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. చాలీచాలని వేతనం అందుకుంటున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. జీఓ 30, జీవో 7ను సవరించి న్యాయబద్ధంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలన్నారు. ఏళ్లగా ప్రభుత్వ శాఖల్లో తక్కువ వేతనానికి పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సీనియారిటీ ప్రాతిపదికన ఏటా ఎంతో కొంత ఇంక్రిమెంట్ రూపంలో ఇవ్వాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనం నుంచి ప్రతి నెలా ఈఎస్ఐ కింద డబ్బులు చెల్లిస్తున్నా సరైన వైద్యం అందడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈఎస్ఐ, ఎంపానల్డ్ ఆస్పత్రుల యాజమాన్యంతో మాట్లాడి సరైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు రామకృష్ణ, గంగాద్రి, ప్రధాన కార్యదర్శులు రాఘవేంద్ర, రమేష్‌నాయక్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కర్ణాటకలో ప్రమాదం... ఉరవకొండ వాసి మృతి


రామేశ్వరరెడ్డి (ఫైల్)

ఉరవకొండ: కర్ణాటకలోని బెంగళూరులో చోటు చేసుకున్న ప్రమాదంలో ఉరవకొండకు చెందిన ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. వివరాలు... ఉరవకొండకు చెందిన సంజీవరెడ్డి కుమారుడు రామేశ్వరరెడ్డి (19) బెంగళూరులోని దయానంద సాగర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం తన స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని ఆటోలో తిరిగి వెళుతుండగా హోరువల్లి కనకపుర రోడ్డు సమీపంలో బస్సు ఢీకొంది. ప్రమాదంలో రామేశ్వరరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. అదే ఆటోలో ప్రయాణిస్తున్న స్నేహితులు తీవ్రంగా గాయపడ్డారు. ఉన్నత చదువులు అభ్యసించి జీవితంలో స్థిరపడుతాడనుకున్న కుమారుడు దుర్మరణం పాలవ్వడంతో తల్లిదండ్రుల వేదనకు అంతులేకుండా పోయింది.

పెయ్య దూడలకు వ్యాక్సిన్

అనంతపురం అగ్రికల్చర్: బ్రూసెల్లోసీస్ వ్యాధి నివారణలో భాగంగా 4 నుంచి 8 నెలల వయస్సున్న పెయ్య దూడల (ఆవు, గేదెలకు సంబంధించి)కు ఉచితంగా టీకాలు వేయనున్నారు. ఈ మేరకు పశుసంవర్ధకశాఖ రెండు జిల్లాల జేడీలు డాక్టర్ జీపీ వెంకటస్వామి, డాక్టర్ జి.శుభదాస్, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (ఏడీ డీఎల్) ఏడీ డాక్టర్ ఎస్.రామచంద్ర ఆదివారం తెలిపారు. ప్రస్తుతం అనంతపురం జిల్లా 6,750 డోసులు, శ్రీసత్యసాయి జిల్లాలో 6,050 డోసుల మందు అందుబాటులో ఉందన్నారు. ఈ ఏడాది ఇప్పటికే తొలి విడతగా 20,150 పెయ్యదూడలకు బ్రూసెల్లోసీస్ టీకాలు ఉచితంగా వేసినట్లు తెలిపారు. రెండో విడతగా డిసెంబర్ 19 వరకు 13,800 పెయ్య దూడలను గుర్తించి వాటికి అవసరమైన వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. బ్రూసెల్లోసీస్ వ్యాధి సోకితే పశువుల్లో జ్వరం, బలహీనత,, చూడి కట్టిన పశువులు ఆఖరి దశలో అబార్షన్ కావడం, మాయ వేయకపోవడం, గర్భస్రావాలు, చూడి నిలబడకపోవడం, మగ పశువులలో వృషణాల వాపు, కీళ్ల వాపు, వ్యంధత్వం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వ్యాధి సోకిన పశువుల గర్భస్రావాలు, మాయ, పాల ద్వారా ఇతర పశువులుకు, అలాగే మనుషులకు కూడా వ్యాధి సోకే ప్రమాదముందన్నారు. వ్యాధి నివారణలో భాగంగా 4 నుంచి 8 నెలల వయస్సున్న దూడలకు ముందస్తుగా ఉచితంగా టీకాలు వేయించుకోవాలని రైతులకు సూచించారు. పాలను బాగా మరిగించి వాడుకోవాలన్నారు. వ్యాధిగ్రస్థ పశువు మిగిల్చిన మేత, పేడ, మాయ, గర్భస్రావం లాంటి వాటిని గుంత తవ్వి పూడ్చివేయాలని సూచించారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్


ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన శబరి వరప్రసాద్‌ను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ కోగటం

- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్

అనంతపురం టవర్‌క్లాక్: ఆర్య వైశ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం స్థానిక కేటీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం, అభినందన సభ జరిగింది. కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్‌తో పాటు వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంఎస్ రాజు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూపకుంట్ల శబరి వరప్రసాద్‌తో పాటు నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మంత్రి భరత్ మాట్లాడుతూ... ఆర్యవైశ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా తన దృష్టికి తీసుకు వస్తే సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటానన్నారు. ఆర్య వైశ్య సత్రం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. పరిశ్రమల నెలకొల్పేందుకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ... ఏ రాజకీయ పార్టీకి ప్రాధాన్యతనివ్వకుండా అందరినీ కలుపుకుని ముందుకు సాగడం ఆర్యవైశ్యుల విధేయతకు నిదర్శనమన్నారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, ఆర్య వైశ్య ప్రముఖులు సుబ్బరాయుడు, షణ్ముఖరావు, సిరిగుప్ప వెంకటేష్, విష్ణుతేజ, వంకదారు జయలక్ష్మి, అనిల్ కుమార్, సుజన్‌కుమార్, మిట్టా వంశీకృష్ణ, వెంకటకృష్ణ, కలవల సతీష్, ముడియం రమణ, గ్రంధి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.